# 'నాకు అందరూ తెలుసు'




"నమస్కారమండీ..!" అంటూ వచ్చాడు ఆ వ్యక్తి.

తలయెత్తి చూసి "నమస్కారం!" అంటూ, 'ఎవరా...' అన్నట్లు ప్రశ్నార్థకంగా చూశాడు మూర్తి.

"నా పేరు రంగారావు అండి. బందర్నుంచి వస్తున్నాను. మీ స్నేహితుడు రాజారావుగారు పంపించారు" అన్నాడు ఆ వ్యక్తి.

"అల్లాగా... కూర్చోండి!" అంటూ కుర్చీ చూపించాడు మూర్తి.

రంగారావు కూర్చున్నాడే కాని, చెప్పదలచుకున్నదేమిటో చెప్పలేక నీళ్లు నమలసాగాడు.

"రాజారావు బాగున్నాడా?" సంభాషణ కదిపే ఉద్దేశంతో అడిగాడు మూర్తి.

"ఆ... బాగున్నారండీ!"

"ఏమైనా పనిమీద వచ్చారా?"

"అవునండీ... ఆ పని మీ వల్లనే కావాలి."

"నా వల్లనా..?" ఆశ్చర్యంగా అన్నాడు మూర్తి.

"అవునండీ... అది మీరే చేయగలరని రాజారావుగారు చెప్పారు."

"... ఏమిటది?"

"ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్‌లో కొంచెం పనివున్నది."

"ఎడ్యుకేషన్ డిపార్టుమెంటా! నేను పని చేస్తోంది హెల్తు డిపార్టుమెంటు కదా!" ఆశ్చర్యపోతూ అన్నాడు మూర్తి.

"అయితే ఏమండీ? మీకు గవర్నమెంటులో తెలీని వారెవరులెండి! నాకు రాజారావుగారు అంతా చెప్పారు లెండి."

"... ఇంతకీ మీ పని ఏమిటి?"

"అదే- అదే... మావాడు యస్.యస్.సి. పరీక్షకి వెళ్లాడు. అన్నీ బాగానే రాశాడనుకోండి. ఒక్క లెక్కల్లో, సైన్స్‌లో మాత్రం కొంచెం అనుమానంగా ఉంది. మీరు కాస్తంత వాడిని గట్టెక్కించాలి..."

"... నేనా? నావల్ల ఏమౌతుంది..?"

"మీరల్లా అనకూడదు. మీరు తల్చుకుంటే ఎంతసేపు? ఎడ్యుకేషన్ సెక్రటరీగారు మీకు తెలుసుగా?"

"ఆ... రావుగారు!"

"ఆ- ఆ... వారే! బోర్డు ఛైర్మన్... మీకు తెలుసుగా?"

"అవును... వెంకటేశంగారు!"

"ఆ... వారే! పరీక్షల సెక్షన్ సూపరింటెండెంటుగారు కూడా తెలుసుగా!"


"ఆ... మహమ్మద్‌గారు!"

"వారే- వారే! వారందరూ మీకు తెలుసుండి, నేనేం చేయగల నంటారేమిటండీ?! నాకు తెలుసు- మీరు వారితో చెప్పి మా అబ్బాయికి కావలసిన మార్కులు వేయించగలరని. మీ ఋణం ఉంచుకోనులెండి."

"అయ్యా... రంగారావుగారూ! మీకు అసలు పాయింట్ అర్థంకాలేదు. మీరు చెప్పినవారందరూ నాకు తెలుసు. కాని, వారెవ్వరికీ నేను తెలీదు. ఆ శాఖలో నాస్నేహితులు చాలామంది ఉన్నారు కనుక, తరచుగా అక్కడికి వెళుతూవుంటాను. అందుకే అక్కడి అధికారుల పేర్లు తెలుసు కాని, వారెవ్వరితో నాకు పరిచయం కూడా లేదు."

"ఆ..!!" అంటూ నోరు వెళ్లబెట్టాడు రంగారావు.

*– జలధి పత్రిక... 1 జూలై '79*




**అతి తెలివి**

ఒక పాలీ క్లినిక్‌లో డాక్టర్‌గారు పేషెంట్‌ను పరీక్షిస్తున్నాడు. డాక్టరు తెలివిని పరీక్షించాలనుకున్నాడు అతి తెలివిగల ఆ పేషెంట్.

డాక్టర్ : మీ ఇబ్బందేమిటో చెప్పండి.

పేషెంట్ : నన్నేమీ అడగకండి. నాకున్న రుగ్మత ఏమిటో తెలుసుకోవడం మీ పని.

డాక్టర్ : అలాగా... సరే! మిమ్మల్ని దగ్గర్లో ఉన్న పశువుల ఆస్పత్రికి రిఫర్ చేస్తాను. అక్కడి డాక్టర్లు ప్రశ్నలు అడగకుండానే రోగనిర్ణయం చేయగలరు.



**అనిత్యాని శరీరాణి**

షావుకారుగారికి దైవభక్తి మెండట. దీనికితోడు- వేదాంత ధోరణి కూడా ఉండనే ఉంది. ఏదో బ్రతకాలి కాబట్టి ఇతరుల దగ్గర సులువైన అప్పులు తెచ్చుకుంటూ, ఇతరులకి అధిక వడ్డీలకి అప్పులు ఇస్తూ దండిగానే సంపాదించేవాడు. అయితే... డబ్బు ప్రసక్తి ఎప్పుడు వచ్చినా "అనిత్యాని శరీరాణి"- అంటే... 'శరీరాలు శాశ్వతం కావు' అన్న సూక్తిని ఉటంకిస్తూండేవాడు. అయితే- ప్రతిరోజూ దుకాణం మూసేసేముందు లక్ష్మీదేవి పటం ముందు నిలబడి ఒకే ఒక ప్రార్థన చేసేవాడు. అదేమంటే...

"అనిత్యాని శరీరాణి
అందరి సొమ్ము నాకే రానీ
ఇచ్చినవారు మరచే పోనీ
మరువకపోతే చచ్చేపోనీ!" అని.